# అమృతం

కిష్ సొరుగులోంచి మూడు స్ట్రిప్స్ తీసి, ముప్పై మాత్రలూ వొలిచి ప్లాస్టిక్ కవర్లో పెట్టి కౌంటర్ మీద ఉంచింది, కేషియర్ రమ.

ఈ టాబ్‌లెట్ల మీద ఏ పేరూ లేదు. స్ట్రిప్స్ లేవు కాబట్టి ఏ కంపెనీవో కూడా తెలియదు.రోజు కొకటి అరవైరోజులు వాడితే చాలు. అనుమానం ఉండదు. ఆచూకీ లేని మరణం. బిల్లు ఉండదు కాబట్టి షాపు తెలియదు. వాడు ఇప్పటికే ముప్ఫై వాడేశాడు. ఇవి వాడితే పనయిపోతుంది.

రవి తెచ్చిన ప్రిస్క్రిప్షన్ స్లిప్ గర్ల్‌కిచ్చింది రమ. ఆమె మందులు తీస్తూ ఉంది.

అతను గుర్తే. నెలకోసారి వస్తాడు. నెలకు కావలసిన మందులు తీసుకెళ్తాడు. పాతికేళ్లు. కారుడ్రైవరు. పాతకారు. గుర్తే.

రమ అందగత్తె స్టన్నింగు బ్యూటీ. ఎత్తు, లావు, విగ్రహ పుష్టి, ముప్పై ఏళ్ళు. సినిమా స్టార్. అలంకారాలు చేసుకొంటే, సొమ్ములు వేసుకొంటే, ప్రపంచ సుందరి.

ఆమెను చూస్తుండటం అతడికి అలాగే చూస్తూ ఉండాలనిపిస్తుంది. పెదాలు తడుపు కొంటాడు.

ప్రతినెలా వస్తాడు యజమానికి మందులు తీసుకుపోతాడు. వస్తూ పోతూ ఉన్నంతసేపూ ఏవో మాట్లాడుతూ ఉంటాడు. ఆమె నవ్వితే కళ్ళు డాన్స్ చేస్తాయి. ఆమె నోటి మాటలు మ్యూజిక్ లాగా ఉంటాయి. నేలరాలే ఆమె నవ్వులు ఏరుకొంటూ ఉంటాడు. మాటలు మనస్సులో రికార్డు చేసుకొంటాడు. ఆమె అందాలు కళ్ళతో ఫోటోలు తీసుకొంటాడు.

'పోయిన్నెల వొలిచిచ్చిన టాబ్‌లెట్లు వొలిచిందెందుకో?' అడిగాడు.

'శాంపుల్స్ ఫార్మాస్యూటికల్స్ రిప్రజెంటేటివ్స్ ఇస్తారు. అమ్మం. ఊరికే! ఫ్రీ. డబ్బులేదు. బిల్లులేదు. అమ్మితే చెడ్డపేరు. శాంపుల్స్ ఇస్తే మందు కొనరు. కంపెనీకీ నష్టం, షాపుకీ నష్టం. ఇన్ని కొంటున్నారుకదా మీ ఓనరు. అందుకే గిఫ్ట్'

'ఎందుకివ్వి?'

'బలానికి! మీరు కొనేవన్నీ బలం మందులే! ఇవి మరింత బలం!'

తన కారు ఓనరు బలంగా ఉన్నాడని, ఆరోగ్యంగా ఉన్నాడనీ, అవన్నీ సెక్స్ బలం మందులని రవికి తెలుసు. రమకు మరీ బాగా తెలుసు. అయినా ఇద్దరు మాట్లాడేటప్పుడు వాటిని బలం మందలనే అంటున్నారు.

'పోయిన్నెల ఇచ్చిన ఈ మందులు – ఈ ఫ్రీ మందులు? మా యజమాని వాడాడు. అప్పణ్ణుంచే నీరసం'

రమకి ఆనందం. పైకి మాత్రం 'నీరసం ఎందుకు? ఒక్క నెలవాడితే విముక్తి జబ్బుకి'

రవికి ఆశ పుట్టింది. 'నాకూ ఇవ్వకూడదూ ఈ మందులు'

రమకు సందేహం కలిగింది. ఈ పిల్ల సన్నాసి మింగుతాడో ఏమోనని.

'పెళ్ళయిందా?'

'కాలేదు?' అని అవకాశం ఏమయినా ఉంటుందా అన్నట్లుగా ఆమె ముఖంలోకి చూశాడు.

రమకు చూపు అర్థమయింది. కోపం వచ్చింది. నవ్వుతూ, రత్నాలు రాలుస్తూ చెప్పింది. 'పెళ్ళికానీ.... ఐదేళ్ళు అవనీ, అప్పుడు ఇచ్చేది, పుచ్చుకొనేది చూచుకొందాం'

అయిదేళ్ళ దాకా ఈ మాత్రలు అక్కరలేదని, తన మగతనాన్ని గుర్తించిందని అర్థమయింది. అప్పుడు చూచుకొందాం అంటే అవకాశం ఉన్నట్లే... అని గ్రహించగానే పెళ్ళి చేసుకోవాలన్న ఉబలాటం మొదలయింది.

'మీ సార్ ఏం చేస్తారు?' అనడిగాడు.

'సారెవురు. సారెవురూ లేరు'

'పెళ్ళికాలేదా?'

'అయింది. పదహారేళ్ళకే కాపురం అయిదేళ్ళే. పిల్లల్లేరు. ఇద్దర్ని ఉంచు కొన్నాడు. నన్ను వెళ్ళగొట్టాడు. కోర్టు కెళితే విడాకులు. రెండు వేలు మనోవర్తి బేంక్‌లో నెల నెలా జమ. మనిషిని మళ్ళీ చూళ్ళేదు. కనబళ్ళేదు. ఏమయ్యాడో ఏమో!'

కూటికి గుడ్డకు రెండు వేలు చాలక సేల్స్‌గాళ్‌గా చేరింది. నమ్మకస్థురాలు. కేషియర్ అయింది. మందుల మర్మాలన్నీ తెలుసు. జబ్బు చెబితే మందిస్తుంది. మంచి నేర్పరి హస్తవాసి మంచిది. ఆమె చేతి మందు ఆరోగ్యానికి విందు.

భర్త లేడు. కుటుంబంలేదు. పిల్లలు లేరు. దిక్కులేంది. అనాథ, భర్త ఉండీ విధవ. అందం యౌవనం పీడలు. తనకీ గతి.

వాడికో.... కన్నెపిల్లలు కావాలి. కసి, ఎందరి బ్రతుకులు బుగ్గి చేస్తాడు? కోపం. తనకీ చావు. వాడికా సుఖం. వాడు చావాలి. కసి. జ్ఞాపకాలు వదలవు.

రవికి ఆకలిగా ఉంది. తినేట్లు చూస్తున్నాడు. గొంగళిపురుగు. అసహ్యం. అయినా భరించాలి. రవి ఒక్కడేకాదు. అందరూ అంతే! తప్పదు. మనుషులే అంత. మళ్ళీ పెళ్ళి ఇష్టంలేదు. చేదు జ్ఞాపకాలు. తొమ్మిదేళ్ళయినా ఆ ఆలోచనల పీడ వదల్లేదు. వాడు చస్తేనే తనకు విముక్తి.

'అతన్ని మర్చిపోలేకుండా ఉన్నారా?'

'లేదు. ఎప్పుడో మర్చిపోయాను!'

టేబిల్ మీద ఉన్న మందుల సీసా తీసి చూసి 'పాయిజన్' అని చదివాడు. 'ఇది విషమా?'

'ఆ రోగికది మందు కాని వాళ్ళకది విషం'

'మందు విషం కాగలదా?'

'పరిస్థితుల ప్రాబల్యం. రోగి పరిస్థితి, మనిషి అవసరం. విషం మందు కూడా కాగలదు.

'స్లో పాయిజన్ అంటే'

'నెమ్మదిగా రెండూ మూడు నెలలకు చంపే మందు?'

'మీ దగ్గరుందా?'

'కావాలా?'

'వద్దు!'

'లేదు!'

'మెడికల్ షాపుల్లో ఉంటుందంటారే!'

'ఉంటుంది. మన షాపులో లేదు' మన అనటం విని ఆనందించాడు.

ఎవరో కష్టమర్ వచ్చాడు. ఏదో మందులు తీసుకొని వెళ్లిపోయాడు. పోతూ 'నిరుత్సాహంగా ఉన్నారే' అన్నాడు 'మరే!' అంది 'ఎందు వల్ల?' అన్నాడు. 'వచ్చేవాళ్ళు రోగులు, రోగులకు కావలసినవాళ్ళు, తీసుకొని పోయేవి మందులు. మందువాడితే బ్రతుకు లేకుంటే చావు. ఏం ఉత్సాహంగా ఉంటుంది' చెప్పింది. 'సారీ!' అని వెళ్ళిపోయాడు.

'మీకు ఉత్సాహం కలిగించే విషయం చెప్పనా?'

'ఊc!'

'నాకు పెళ్ళి కాలేదు'

'సరే! మీకు పెళ్ళి కాకపోతే నాకెందుకు ఉత్సాహంగా ఉంటుంది.'

'ఊహించండి!'

ఆమెకు ఉత్సాహం కాదుగానీ సరదాగా ఉంది. ఈ తొమ్మిదేళ్ళలో ఇటువంటి మనస్థితి తానెరగదు.

'మీ వయస్సెంత!' ఎందుకడిగిందో ఆమెకే తెలియదు.

'ముప్పై! అబద్ధం చెప్పాడు.

'పిల్లవాడిలాగా ఉంటావు'

'నిజమే! నిత్య యౌవనం!' నవ్వాడు. ఎందుకో రమ కూడా నవ్వింది. ఆమె కేదో కొత్తగా ఉంది.

'మీ వయస్సు' అడిగాడు. 'అంతే!' అంటూ నవ్వింది.

'మిమ్మల్ని చూశాక పెళ్ళి చేసుకోవాలనిపిస్తూ ఉంది?'

'ఎవర్ని?'

'ఎవర్ని అంటే ఏం చెప్పేది! ఆమె ఇష్టం కనుక్కోవాలి కదా!'

రమ మౌనంగా ఉంది. వ్యవహారం మునుం పెట్టాడు. ఇంక పాయ తీసి దున్నుకొంటూ పోతాడు.

రమకు కూర్చో బుద్ధి కాలేదు. లేచి మందుల రేక్‌ల దగ్గరకు పోయింది. ఏదో ఉత్సాహంగానే ఉంది.

వాడు చస్తే తనకేం లాభం? ఆలోచించింది. ఇప్పుడు తాడుంది. అప్పుడూ తీయనక్కరలేదు... వాడు చచ్చినా బతికినా ఒకటే.

గుండె కలుక్కుమంటూ ఉంది.

అవసరం లేనివి రేక్‌లలో అటూ ఇటూ సర్దింది. మందుల అరల అద్దాలు లాగింది. వేసింది. బీరువాలు తీసి చూసి వేసి వచ్చింది.

ఆరోజు ఆర్డరు ఇవ్వవలసిన మందుల జాబితా చూసి పక్కన పెట్టింది.

ఆమె కేష్ కౌంటర్‌లో కూర్చోగానే దగ్గరగా వంగి 'మీరంటే నాకిష్టం' అన్నాడు.

ఆమె వింది. విననట్లు మౌనంగా కూర్చుంది. పరధ్యానం నటించింది. లోపల్లోపల పొంగిపోయింది.

తను చాలా మందిని ఆకర్షిస్తున్నట్లు చాలా కాలంగా గుర్తిస్తూ వచ్చింది. కానీ తను ఆకర్షించే మనిషి ఎదుట ఉన్నాడు. తనకు ఇష్టమవుతున్నాడు.

'మీకిష్టమైతే మిమ్మల్ని పెళ్ళి చేసుకొంటాను!' అన్నాడు. రహస్యంగా, వంగి, చెవిలో.

చెవిలో అమృతం పోసినట్లయింది.

సంతోషంగా ఉన్న రమ ముఖంలో చీకటి రేఖలు ప్రవేశించాయి. మబ్బు కమ్మిన స్వచ్ఛ ఆకాశంగా అయిపోయింది. కళ్ళు చెమ్మగిల్లాయి.

డాక్టర్లు, నర్సులు మందుల షాపుల వాళ్ళు రోగుల్ని బతికించాలి. చంపకూడదు. తాను చంపలేదు. వాడు చావరాదు. తాను తప్పుచేసింది. మళ్ళీ ఆ తప్పు చేయదు. చేయరాదు.

తనకు పిల్లలు కలగ లేదు. సృష్టి జరగలేదు. తాను కనాలి చంపరాదు. సృష్టి చేయాలి. విధ్వంసం చేయరాదు. వాడు దుర్మార్గుడేకానీ తాను దుర్మార్గురాలు కానక్కరలేదు.

మౌన ముఖం నుంచి ధారాపాతంగా కన్నీరు. చేతి గుడ్డతో కన్నీరు తుడుచుకొంది. తుఫాను వెలిసింది. ఆమె ముఖం ప్రసన్నంగా ఉంది.

ఇంత అందంగా రమ ముఖం ఇంతకు ముందు ఉండేది కాదు. ఇప్పుడు వెలిగిపోతూ ఉంది.

రవికి ఏడ్పు ఎందుకో నవ్వు ఎందుకో అర్థం కాలేదు.

సేల్స్‌గల్ ప్రిస్క్రిప్షన్ స్లిప్ మందుల పాకెట్లు కేష్ కౌంటర్లో రమ ముందు పెట్టింది.

రమ బిల్లు వేసి, డబ్బు తీసుకొని మందుల పాకెట్లు ఇచ్చింది.

రవి అన్నీ చూచుకొని, 'ఫ్రీ మెడిసన్స్ ఊరికే ఇచ్చేవి. ఇవాళ మర్చిపోయారు'

'మర్చి పోలేదు., ఇవే' ప్లాస్టిక్ పాకెట్టు చూపించింది 'ఇవ్వటం లేదు. వీటిని కేష్‌కొంటరు సొరుగులో దాచింది.

ఇప్పుడు రమ మరింత అందంగా ఉంది. అతిలోక సౌందర్యవతి అనుకొన్నాడు రవి.

'ఏం?'

'మీ యజమాని ఆ కారు ఓనరు, మీ మూలంగా బతుకుతున్నాడు బతికి చావమని చెప్పండి'.

❀